క్లుప్తంగా

రూ. 9లక్షలు పలికిన తైబజార్



వేలం దక్కించుకున్న వారికి పత్రం అందజేస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ తైబజార్‌కు గురువారం వేలం నిర్వహించగా మహ్మద్ జహంగీర్, అలీ మన్సూర్‌లు సంయుక్తంగా రూ. 9లక్షలకు దక్కించుకున్నారు. 2023 –24 సంవత్సరానికి గాను మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన వేలం జరిగింది. గతేడాది రూ. 6.02 లక్షలకు పలికిన వేలం, ఈ సారి 10 శాతం ఎక్కువగా కలిపి రూ. 6.60 లక్షలను సర్కార్ పాటగా మొదలు పెట్టారు. చివరకు రూ. 9లక్షలకు జహంగీర్, అలీ మన్సూర్ దక్కించుకున్నారు. ఏడాది పాటు మున్సిపల్ పరిధిలోని వీధి వ్యాపారుల నుంచి అధికారులు నిర్దేశించిన మేరకు రుసుం వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సుదర్శన్, నాయకులు అలీ మన్సూరి, దస్తగిరి, హమీద్, అబ్దుల్ రవూఫ్, అంజద్ ఖాన్, షాకీర్, బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా వార్డు అభివృద్ధి

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శివకుమార్

తుక్కుగూడ: వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని బీజేపీ తుక్కుగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై శివకుమార్ తెలిపారు. గురువారం రావిర్యాల 4వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. వార్డును దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

మీర్‌పేట: జిల్లెలగూడ లార్డ్స్ హైస్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్స్ చైర్మన్ సీ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్టు శేష మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల నగర జీవితంలో తల్లిదండ్రులు పిల్లలతో రోజులో కొంత సమయాన్ని కేటాయించడంతో పాటు ప్రేమానురాగాలతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీ శ్రీలత, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో మహేశ్వరం నేతలు



దీక్షలో పాల్గొన్న మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: రాహుల్ గాంధీని ఎంపీ నుంచి తొలగించినందుకు నిరసనగా గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్షకు మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు ఈ ప్రవీణ్ పటేల్, డీ రవి, సంగారెడ్డి, కేజీ ప్రసాద్, జీ శ్రీకాంత్, హైతాబాద్ రాజు, ఎల్ బాలరాజు తదితరులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు.

బీజేపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

వనస్థలిపురం: బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన జి.వాసు చౌదరి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసు చౌదరికి ఎమ్మెల్యే రాజేందర్ అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజేందర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, నాయకులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న 'వీధి సింహాలు'

- కాలనీల్లో వీధి కుక్కల స్వైరవిహారం
- పాదచారులు, చిన్నారులపై దాడి
- రోజురోజుకూ పెరుగుతున్న కుక్కకాటు బాధితుల సంఖ్య



కాలనీలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



కుక్క కాటుకు గురై వనస్థలిపురం ఆస్పత్రికి వచ్చిన బాలుడు

వనస్థలిపురం: ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. శునకాల బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కాలనీల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులుగా సంచరిస్తూ దారిన పోయే వారి వెంటపడి మరీ పిక్కలు పీకేస్తున్నాయి. ముఖ్యంగా వీధుల్లో ఆడుకుంటున్న వారిపై కుక్కలు దాడి చేయడం ఆందోళన కలిగిస్తోంది.

◆ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ప్రతి కాలనీలో ఏ గల్లీలో చూసినా వీధి కుక్కలు తిష్టవేసి ఉంటున్నాయి. కాలనీల్లోని చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను, ఇతర ఆహార పదార్థాలను కొందరు యథేచ్ఛగా రోడ్లపై పడేస్తున్నారు. వాటిని తినేందుకు కుక్కలు అక్కడే తచ్చాడుతూ గుంపులుగా తిరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్లపై వెళ్లే పాదచారులు, చిన్నారులపై తరచూ దాడులు



చేస్తూ గాయపరుస్తున్నాయి. కుక్కలు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారినీ వదలడం లేదు. ద్విచక్ర వాహనాలను కుక్కలు వెంబడిస్తూ దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. వాటి నుంచి తప్పించుకొనే క్రమంగా వాహనం అదుపు తప్పి పడిపోవడంతో వాహనదారులు గాయపడిన ఘటనలు కూడా జరుగుతున్నాయి. కుక్కల బెడదను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

తీసుకెళ్లి.. తీసుకొస్తున్నారు !

కాలనీల్లో గుంపులుగా సంచరిస్తు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న కుక్కలను పట్టుకెళ్లాలని ఎన్నోమార్లు ఫిర్యాదులు చేయంగా ఎప్పుడో ఒకసారి జీహెచ్ఎంసీ అధికారులు స్పందిస్తున్నారని కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. సిబ్బందిని పంపించి దొరికిన కుక్కలను తీసుకెళ్తున్నారని, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించి ఎక్కడి నుంచి తీసుకెళ్లారో అక్కడే వదిలి వెళ్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సంతాన శస్త్ర చికిత్సల మాట అటుంచితే ఉన్న కుక్కల మాటేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు బయటికి వెళ్తే ఇంటికి వచ్చే వరకు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రోజూ 10నుంచి 20కేసులు

వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఎల్బీ నగర్, పరిసర ప్రాంతాల నుంచి నిత్యం కుక్కకాటు బాధితులు వస్తున్నారు. ప్రతి రోజూ కనీసం 10నుంచి 20 వరకు కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. బాధితుల కోసం ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. వచ్చిన వారికి తక్షణ వైద్యం అందిస్తున్నాం.

– ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ, వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన బీ రిషిత అనారోగ్యానికి గురవగా చికిత్స నిమిత్తం సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ కే రాములు విన్నపం మేరకు మంత్రి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 85వేలు మంజూరు చేయించారు. గురువారం లబ్ధిదారు తండ్రికి తన నివాసంలో ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం రాజకీయాలను పక్కకు పెట్టి అందరూ కలసిరావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి, ఎంపీటీసీ సురేష్, మాజీ ఎంపీటీసీ ఈ సత్తయ్య, నాయకులు టీ కార్తీక్, వెంకటయ్య, కే శివాచారి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహేశ్వరం: డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక ప్రగతికి పునాదులు వేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మహేశ్వరం బ్రాంచ్ మేనేజర్ రమేష్ సూచించారు. నాబార్డు సహకారంతోనే సొసైటీ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫ్యాషన్ డిజైన్ కోర్సు శిక్షణ శిబిరంలో 12వ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలు లోన్లు ఎలా తీసుకోవాలి, ఎలా కట్టుకోవాలి, ఉపాధి ఎలా చూసుకోవాలి, పొదుపు చేసుకునే మార్గాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు క్రాంతి, సొసైటీ అడ్మినిస్ట్రేషన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కో– ఆర్డినేటర్ షేక్ హాజీబాబా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న మేనేజర్ రమేష్, డ్వాక్రా మహిళలు

చిన్నారులకు స్వర్ణామృత ప్రాసన చుక్కలు

మీర్‌పేట: మీర్‌పేట వికాస తరంగిణి ఆధ్వర్యంలో గురువారం జిల్లెలగూడలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో, సిల్వర్‌డ్రాప్స్ స్కూల్‌లో స్వర్ణామృత ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బీ రాజేందర్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై 16 సంవత్సరాల లోపు పిల్లలకు చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వర్ణామృత ప్రాసన చుక్కలు వేయడం ద్వారా పిల్లల్లో రోగ నిరోధక శక్తి, మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా శారీరక రుగ్మతలు తొలగిపోతాయన్నారు. సుమారు 330 మంది పిల్లలకు చుక్కలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ బాధ్యులు అహల్య, సభ్యులు రూపవతి, ఉష, ప్రసన్న, మాలతి, సువర్ణ, రవీందర్‌రెడ్డి, రఘువీర్, ఉమా, రాధిక, వేముల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాలుడికి స్వర్ణామృత ప్రాసన చుక్కలు వేస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి

కడ్తాల్: టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి పంపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ.. లీకేజీ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని.. నిందితులను కఠినంగా శిక్షించాలని.. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయలేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు అజ్గర్‌అలీ, క్యామ రాజేశ్, ఇమ్రాన్‌బాబా, వంశీ, సత్యం, పవన్, గణేశ్, ప్రవీన్ ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని ఆమనగల్లు మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎండీ ఫరీద్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రిజిస్టర్ పోస్టు చేశారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలకు పాల్పడుతూ నిరుద్యోగుల పాలిట యమపాశంగా మారిన బోర్డును ప్రక్షాళన చేయాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ఆబిద్, శివ, ఈశ్వర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని వీఓఏల నిరసన



నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వీరికి దెబ్బడగూడ సర్పంచ్ ఏ శ్రావణి మద్దతు తెలిపారు. అంతకుముందు జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసిన వీఓఏలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బీ బాలరాజు, వీఓఏలు పద్మ, రజని, రాధ, జీ కవిత, కల్పన, జ్యోతి, దేవి, శశికళ, స్వప్న, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో అధికారుల పర్యటన



కాలనీ సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ అధికారులు లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని బీటీ రోడ్డును విస్తరించాలని, శానిటేషన్ పనులు చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కృతుంగ హోటల్ నుంచి బేకర్స్ క్యూ వరకు డ్రైనేజీ లైన్ పెంచాలని విన్నవించారు. దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాలనీలో పార్కును అభివృద్ధి చేయడంతో పాటు మహిళా భవనం నిర్మించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ప్రజల విన్నపాలను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్ కొండల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు పూజ, శివ, సురేష్, సతీష్, శంకర్, పోలీసు శాఖ నుంచి మహా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

సీపీఐ రాష్ట్ర నాయకుడు నర్సింహ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మంచాల: అవినీతి పాలనకు చరమగీతం పాడాలంటే కేంద్రంలో బీజేపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కావలి నర్సింహ అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని దాద్‌పల్లి, చీదేడ్, కొర్రం తండా, బోడకొండ, సత్తి తండా, లోయపల్లి, చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల్లో సీపీఐ ప్రజా పోరు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచేయడంతో మార్కెట్‌లో ఏమి కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. సామాన్య పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందని తెలిపారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నీలమ్మ, జిల్లా నాయకులు లక్ష్మయ్య, నర్ల శ్రీశైలం, కృష్ణ, విజయ్‌కుమార్, నర్సింహ, కిషన్, కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల మంజూరు పత్రాలు అందజేత



నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 6వ వార్డు, 10వ వార్డుల్లో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.2లక్షల మండల పరిషత్ నిధులను మంజూరు చేశారు. దీనికి సంబంధించి ప్రొసీడింగ్‌ను వార్డుసభ్యులకు అందజేశారు. వార్డు సభ్యులు ఎట్టమ్మ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్, నాగార్జున, రాజేశ్, రమేశ్, భానుకిరణ్, జంగమ్మ, అలివేలు, లక్ష్మమ్మ, యాదమ్మ, ఆండాలు ఉన్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న అంజయ్య

యాచారం: ఉపాధి కూలీలకు ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని.. అలాగే చేసిన పనికి వారం, వారం వేతనాలు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో నిధులను తగ్గించడంతో పాటు పలు నింబంధనలు పెట్టిందని అన్నారు. కేంద్రం పెట్టే నింబంధనల వల్ల కూలీలు ఉపాధి పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదని అన్నారు. చేసే పనులకు నెలలు గడుస్తున్న వేతనాలు రాకపోవడంతో కూలీలు పస్తులుండాల్సిన దుస్థితి వస్తుందని అన్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా, ఆందోళనలు, ధర్నాలు చేసిన పట్టించుకునే వారే లేరని మండిపడ్డారు. కూలీల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంజీవ, గోపాల్, చెన్నరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బీ బాల్‌రాజు కోరారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి తెచ్చుకున్న 8 గంటల పనిదినాలను మోడీ ప్రభుత్వం 12గంటలకు పెంచి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

ఉప్పరాశి కుంటను ఆక్రమిస్తే చర్యలు

సర్వే పనులను ప్రారంభించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు



ఉప్పరాశి కుంటను పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ఉప్పరాశి కుంట చెరువు సర్వేను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గురువారం ప్రారంభించారు. ఉప్పరాశి కుంట శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు పలుమార్లు మండల, గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, స్థానికులు ఆందోళన చేపట్టడంతో పాటు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉప్పరాశికుంట సర్వేకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అధికారులు చెరువును పరిశీలించారు. రికార్డుల ప్రకారం చెరువుకు సర్వే నిర్వహించి హద్దు రాళ్లు పాతుతామని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను నిర్ధారించి ఆక్రమణలకు పాల్పడితే చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. రెండు రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మైనర్ ఇరిగేషన్ శాఖ ఏఈ నిఖిల, సర్వేయర్ పాండురంగారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, చందోజీ, రాఘవేందర్, లక్ష్మయ్య, రాఘవేందర్, సుధాకర్‌గౌడ్, కృష్ణ, శేఖర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వెంచర్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామ శివారు, గోవిందాయిపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 52లో గల ప్రభుత్వ, అసైండ్, బంజరు భూములను ఆక్రమించిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ రియల్ వ్యాపారికి 50 ఎకరాల భూమిని అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ప్రస్తుతం అట్టి భూములను వెంచర్‌గా ఏర్పాటు చేశారని భూమిని చదును చేశారని అన్నారు. ఆక్రమణదారుడి నుంచి భూమిని రక్షించాలని కోరారు. ప్రభుత్వ అసైండ్ భూమికి డీటీసీపీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి పేరు మీద ఉన్న అసైండ్ భూములను రద్దుచేయాలని తిరిగి గిరిజనుల భూములు గిరిజనులకు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు భగీరథ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, సాయిలాల్, డాక్టర్ రమేశ్‌అయ్యగార్, సాయిలు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.